## డీటీఆర్‌లు ఏర్పాటు


డీటీఆర్‌ను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

ఇచ్చోడ(సిరికొండ), జూన్ 21 : ఆదిలాబాద్ జిల్లా సిరికొండలోని మొదటి వాడలో నెల రోజుల క్రితం రెండు డీటీఆర్‌లను బిగించడానికి కాంట్రాక్టర్ తీసుకువచ్చారు కానీ అమర్చడం మరిచిపోయారు. ఈ నేపథ్యంలో కాలనీ వాసులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యపై 'నమస్తే తెలంగాణ'లో ఈ నెల 20న తేదీన 'ట్రాన్స్‌ఫార్మర్ తీసుకువచ్చారు.. అమర్చడం మర్చారు' అనే శీర్షిక కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన విద్యుత్ శాఖ సిరికొండ లైన్‌మెన్ నందు ఆధ్వర్యంలో కాంట్రాక్టర్ శనివారం రెండు డీటీఆర్‌లను అమర్చారు. కాలనీలో రెండు డీటీఆర్‌లు ఏర్పాటు చేయడంతో విద్యుత్ సమస్య పరిష్కారమైంది. కాలనీవాసులు నమస్తే తెలంగాణకు కృతజ్ఞతలు తెలిపారు.

### బోథ్ సీహెచ్‌సీ సూపరింటెండెంట్ బదిలీ

బోథ్, జూన్ 21: ఆదిలాబాద్ జిల్లా బోథ్ సీహెచ్‌సీ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా వ్యవహరిస్తున్న డాక్టర్ రవీంద్ర ప్రసాద్ బదిలీ అయ్యారు. ఇన్ని రోజులుగా ఉట్నూర్‌లో స్పెషలిస్ట్ డాక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆయన బోథ్ సీహెచ్‌సీ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా వ్యవహరించారు. ఆయన స్థానంలో ఉట్నూర్‌లో స్పెషలిస్ట్ డాక్టర్‌గా పని చేస్తున్న కే రవి కుమార్‌ను ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. కాగా రాజకీయ కారణాలతోనే డాక్టర్ రవీంద్ర ప్రసాద్ బదిలీ జరిగినట్లుగా తెలుస్తుంది. ఇక్కడ ఆరుగురు వైద్యులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ఇద్దరు మాత్రం ఉన్నారు. ఇక్కడ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా వచ్చిన డాక్టర్ కే రవి కుమార్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. ఇక్కడి నుంచి ఉట్నూర్‌కు బదిలీపై వెళ్లిన రవీంద్ర ప్రసాద్ సైతం దీర్ఘకాలిక సెలవు పెట్టినట్లుగా తెలుస్తోంది.

### విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలి

ఎదులాపురం, జూన్ 21 : విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కన్‌స్ట్రక్షన్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఇంజనీర్ జేఆర్ చౌహాన్ అన్నారు. శనివారం ఆదిలాబాద్ సర్కిల్‌లోని ఆఫీసర్లతో సర్కిల్ రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆఫీసర్లు, సిబ్బంది హెడ్ క్వార్టర్స్‌లో ఉంటూ ప్రజలకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అగ్రికల్చర్ సర్వీసులు వెంటనే రిలీజ్ చేయాలన్నారు. అన్ని మండలాల అసిస్టెంట్ ఇంజనీర్లు అన్ని కేటగిరీల పెండింగ్ బిల్లులు వంద శాతం వసూలు చేయాలని తెలిపారు. సమావేశంలో డివిజనల్, అసిస్టెంట్ డివిజనల్, అసిస్టెంట్, సబ్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

### ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలి

ఎదులాపురం, జూన్ 21: బెస్ట్ అవైలబుల్ పథకం ద్వారా చదువుతున్న విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్ర అశోక్ అన్నారు. శనివారం ఆదిలాబాద్‌లో ఆయన మాట్లాడారు. రెండు సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల కావడం లేదన్నారు. దీంతో పేద విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

### ఆదిలాబాద్ టూ టౌన్ ఎస్ఐగా దివ్యభారతి

ఎదులాపురం, జూన్ 21: ఆదిలాబాద్ టూటౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా దివ్యభారతి నియమితులయ్యారు. శనివారం డీఎస్పీ జీవన్ రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి రిపోర్ట్ చేశారు. తాంసి ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న దివ్యభారతి టూ టౌన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

### బాధిత కుటుంబానికి పరామర్శ

భైంసా, జూన్ 21 : నిర్మల్ జిల్లా రాజేష్‌నగర్‌కు చెందిన గోవిందమ్మ ఇటీవల మృతి చెందింది. బాధిత కుటుంబ సభ్యులను శనివారం బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యుడు విలాస్ గాదేవార్ పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు నిమ్మ సురేశ్, తదితరులు ఉన్నారు.

### ఉచిత వైద్య శిబిరం


సూపరింటెండెంట్ డాక్టర్ కాశీనాథ్‌ను జ్ఞాపిక అందజేస్తున్న జిల్లా న్యాయమూర్తి శ్రీవాణి

భైంసా, జూన్ 21 : నిర్మల్ జిల్లా భైంసాలోని న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం కోర్టు ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి శ్రీవాణి మాట్లాడుతూ అన్ని పరీక్షలు ఉచితంగా నిర్వహించడం జరిగిందన్నారు. అనంతరం వైద్యులు వైద్య పరీక్షలు చేశారు. అంతేకాకుండా రక్తదానం చేసిన పలువురికి, వైద్యులకు ప్రశంసా పత్రాలు అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో భైంసా న్యాయమూర్తి దేవేందర్ బాబు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శంకర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుడు కూతురు ప్రభుత్వ పాఠశాలలో చేరిక


పాఠశాలలో అడ్మిషన్ పొందుతున్న ఉపాధ్యాయుడి కూతురు

ఉట్నూర్ రూరల్, జూన్ 16 : ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని సాలేవాడ(బీ) ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు కృష్ణ తన కూతురును శనివారం అదే పాఠశాలలో చేర్పించారు. ప్రధానోపాధ్యాయుడు జాదవ్ చంద్రకాంత్ అడ్మిషన్ ఇచ్చారు. ఐదు రోజుల క్రితం శ్యాంపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న గణిత ఉపాధ్యాయుడు రాథోడ్ రవీందర్ తన కుమారుడు రాథోడ్ వరుణ్ నాయక్‌ను అదే గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 3వ తరగతిలో చేర్పించారు. వారిని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఉపాధ్యాయుడు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ప్రధానోపాధ్యాయుడు సూచించారు. అప్పుడే ప్రజలు ప్రభుత్వ విద్యపై మరింత నమ్మకం పెరుగుతుందని అన్నారు. ఇక్కడ ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

### ఆటో బోల్తా పడి ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు

కడెం, జూన్ 21: ఆటో బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు కడెం ఎస్ఐ కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం..కడెం మండలం పెద్దూర్ గ్రామానికి చెందిన పర్వెల్లి రాజేందర్ (45) అదే గ్రామానికి చెందిన పర్వెల్లి మల్లేశ్, గుండాల్ల కృష్ణతో ఆటోలో దస్తురాబాద్ మండలంలోని వాళ్ల అక్క ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్నారు. అంబారిపేట గ్రామ సమీపంలోని శ్మశాన వాటిక పక్కన గల మూలమలుపు వంతెన వద్ద అదుపు తప్పి ఆటో బోల్తాపడగా ఆటో నడుపుతున్న రాజేందర్ మృతి చెందాడు. ఆటోలో ఆయనతో పాటు ప్రయాణిస్తున్న పర్వెల్లి మల్లేశ్, గుండాల్ల కృష్ణకు తీవ్ర గాయాలు కాగా వారిని ఖానాపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నిర్మల్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## భార్యాభర్తలపై కేసు

- భర్త అరెస్ట్, రిమాండ్.. భార్య పరారీ
- డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఎదులాపురం, జూన్ 21 : చీటింగ్ కేసులో భార్యాభర్తలపై కేసు నమోదు చేసి భర్తను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా.. భార్య పరారీలో ఉన్నట్లు డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. వకుళాభరణం ఆదినాథ్ తన భార్య వకుళాభరణం రజిని 2010 సంవత్సరంలో ఖానాపూర్ శివారులోని ఫారెస్ట్ భూమిని తన పేరిట ఉందంటూ నమ్మించి ప్లాట్లు చేసి విక్రయించారు. ఇందులో 57, 58, 59, 60 నంబరు గల ప్లాట్లను ఒక్కో ప్లాటుకు రూ.3.30 లక్షల చొప్పున శోభ ముర్ధార్ కొనుగోలు చేసింది. ఈ విషయంపై 2022లో ఫారెస్ట్ అధికారులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. దీంతో ఆ బాధితులు తమ డబ్బులను తిరిగి ఇవ్వాలని, ఫారెస్ట్ భూమిని తమకు డబ్బులకు అమ్మారని నిందితులను అడుగగా వారు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారన్నారు. ఈ విషయం కోర్టులో చూసుకోవాలని, మీకు నచ్చిన వారికి చెప్పుకోమని బెదిరింపులకు పాల్పడ్డాడు. శోభ ముర్ధార్ ఈనెల 19న మావల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శనివారం ప్రధాన నిందితుడు వకుళాభరణం ఆదినాథ్‌ను అరెస్టు చేసి న్యాయమూర్తి ఎదుట ప్రవేశపెట్టారు. 14 రోజుల జ్యూడిషియల్ రిమాండ్‌కు పంపించారు. భార్య రజిని పరారీలో ఉన్నట్లు తెలిపారు. వకుళాభరణం ఆదినాథ్ బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కావడం గమనార్హం.ఈ సమావేశంలో సీఐ కె.స్వామి, ఎస్సై ముజాహిద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి

## ప్రధాన రహదారి గుంతల మయం


వివేకానంద చౌరస్తా నుంచి కుభీర్‌కు వెళ్లే దారి దుస్థితి

కుభీర్, జూన్ 21 : నిర్మల్ జిల్లా కుభీర్‌లోని వివేకానంద చౌరస్తా నుంచి గ్రామం లోపలికి వెళ్లే ప్రధాన రహదారి తీవ్రంగా దెబ్బతింది. తారులేచి పెద్ద గుంతలు ఏర్పడడంతో వాహనదారులు, కాలినడకన వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారు. జాంగాం, రంజిని, రంజితండా, ధార్కుబీర్, బెల్గాం, బెల్గాంతండా, సిర్పెల్లి దాని అనుబంధ తండాలు, మహారాష్ట్రలోని ఇస్లాపూర్, హిమాయత్‌నగర్ గ్రామాల ప్రజలు ఈ రహదారిని వినియోగిస్తున్నా పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. వర్షం నీరు ఈ రోడ్డుపై నుంచి పారుతుండడంతో రోడ్లపై మోకాళ్ల లోతు నీళ్లు నిలిచిపోతున్నాయి. కాలువ నిర్మాణంతో పాటు రోడ్డు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

### ఆరు కిలో మీటర్లు గుంతలు..


గుంతలమయమైన కస్ర వెళ్లే రోడ్డు

కుభీర్, జూన్ 21: కుభీర్ నుంచి కస్ర, కస్ర తండా నుంచి సొనారి మార్గంలో భైంసా వరకు వెళ్లే రహదారి ప్రమాదకరంగా మారింది. ఆరు కిలో మీటర్ల దూరం వరకు తారు లేచిపోయి గుంతలు ఏర్పాడ్డాయి. వర్షాలు కురిసనప్పుడు గుంతల్లో నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వాగు వంతెన వద్ద పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా ఉంది. వెంటనే మొరం వేసి రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## ఇంటిగ్రేటెడ్ స్కూల్ సాధన కమిటీ ఎన్నిక

ఖానాపూర్, జూన్ 21 : నిర్మల్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గ కేంద్రానికి మంజూరైన ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను ఖానాపూర్‌లో నిర్మించాలని శనివారం మండలానికి చెందిన పలువురు ప్రముఖులు ఖానాపూర్ ఇంటిగ్రేటెడ్ స్కూల్ సాధన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా సాగు లక్ష్మణ్‌రావు, కన్వీనర్‌గా నంది రామయ్య, ఆకుల శ్రీనివాస్, బీసీ రాజన్న, కొండాడి గంగరావు, కార్యదర్శిగా కాశవేని ప్రణయ్, ఎనుగందుల నారాయణ, సలహాదారులుగా ప్రదీప్, గౌరికర్ రాజు, రాజశేఖర్, శ్రావణ్, ఉపేందర్‌ను ఎన్నుకున్నారు. ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందుబాటులో ఉండేలా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవన నిర్మాణానికి కృషి చేస్తామని కొత్తగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు. ఇందులో పలు మండలాల అఖిల పక్ష నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు.


ఎన్నికైన ఖానాపూర్ ఇంటిగ్రేటెడ్ స్కూల్ సాధన కమిటీ కార్యవర్గ సభ్యులు

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సోన్, జూన్ 21: సారంగాపూర్ మండలంలోని చించోలి(బీ) ఉప కేంద్రంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో గల 11కేవీ విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా నిర్మల్ మండలంలోని డ్యాంగాపూర్ లైన్‌లో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని డీఈ నాగారాజు తెలిపారు. ఈ విషయాన్ని డ్యాంగాపూర్, గంగాపూర్‌తండా వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## జయశంకర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం


భైంసా: నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు విలాస్ గాదేవార్

భైంసా, జూన్ 21 : ప్రొఫెసర్ జయశంకర్ ఆశయ సాధనకు కృషి చేద్దామని బీఆర్ఎస్ ముథోల్ నియోజవర్గ నాయకుడు విలాస్ గాదేవార్ అన్నారు. శనివారం నిర్మల్ జిల్లా భైంసాలోని జయశంకర్ కాలనీలో, వికాస్ పాఠశాలలో జయశంకర్ సార్ 14వ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ, విశ్మకర్మ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుల రవీంద్ర చారి, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ సాగర్, భైంసా పట్టణ అధ్యక్షుడు గోపాల్, అశోక్, కృష్ణమూర్తి, బెజ్జంకి శ్రీనివాస్, దశరథ్, వెంకటేశ్, పుండలిక్ రావు, డాక్టర్ రామకృష్ణ గౌడ్, నిమ్మ సురేశ్, వాసే, రావుల పోశెట్టి, పాల్గొన్నారు.

బోథ్, జూన్ 21: ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లో జయశంకర్ సార్ 14వ వర్ధంతిని శనివారం నిర్వహించారు. మార్కెట్ కమిటీ యార్డులో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గంగారెడ్డి, పసుల చంటి, రాజు యాదవ్, మహ్మద్ అబ్రార్, రవి పాల్గొన్నారు.

నిర్మల్ అర్బన్, జూన్ 21 : నిర్మల్‌లో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని నిర్వహించారు. జయశంకర్ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు కోటగిరి శ్రీధర్, రాకేశ్, సత్యనారాయణ, శ్రీకాంత్, నర్సింహాచారి పాల్గొన్నారు.

## ఆదివాసుల సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

ఎదులాపురం, జూన్ 21 : ఆదివాసుల సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వ పూర్తిగా విఫలమైందని తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేశ్ అన్నారు. శనివారం ఆదిలాబాద్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 10 జనవరి 2025న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్కతో ఎమ్మెల్యేలతో పాటు ఉన్నతాధికారులు ఆదివాసులతో కలిసి నిర్వహించిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు అమలులోకి రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య, వైద్యం ఉద్యోగావకాశాలు, రోడ్లు, రవాణా, సాగు, తాగునీరు వంటి పలు అంశాలు, జీవో నంబర్ 3 పునరుద్ధరణ ఏజెన్సీ ప్రాంతాల్లో జీవో నంబర్ 317 రద్దు, ఆదివాసులకు ఇంటి పట్టాలు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు, ఓవర్సీస్ స్కాలర్ షిప్‌లకు సంబంధించి బిల్లుల క్లియరెన్స్ వంటి అంశాలు ఇప్పటికి పరిష్కారం కాలేదని విమర్శించారు. ఇప్పటికే మంజూరైన బీఈడీ కళాశాలకు టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మనోజ్, కోలాం సేవా సంఘం వ్యవస్థాపక జిల్లా అధ్యక్షుడు కొడప సోనేరాశ్, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు రేణుక, ఉపాధ్యక్షురాలు ఉయిక ఇంద్ర, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వరుణ్, ఏడీసీసీ డైరెక్టర్ పరమేశ్వర్, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు అశోక్, కుమ్రం సూరు యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కుమ్ర రాజు పాల్గొన్నారు.

## స్పెషల్ జాకెట్‌లో దేశీదారు సీసాలు


దేశీదారు సీసాలు తీసుకువచ్చిన వ్యక్తితో ఎక్సైజ్ పోలీసులు


దేశీదారు తరలించేందుకు తయరు చేసిన స్పెషల్ జాకెట్

ఎదులాపురం, జూన్ 21 : మహారాష్ట్ర నుంచి దేశీదారును తరలించేందుకు కొంత మంది కొత్త పద్ధతులు అనుసరిస్తున్నారు. ఇదే నేపథ్యంలో ఆదిలాబాద్ జిల్లాలో ఒక వ్యక్తి తన శరీరానికి స్పెషల్ జాకెట్ వేసుకుని మద్యం సీసాలు దాచిపెట్టిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఎక్సైజ్ అధికారులు తనిఖీల్లో భాగంగా ఈ వ్యక్తిని పట్టుకున్నారు. గత వారం రోజుల వ్యవధిలో జిల్లాలోని మూడు వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహించిన దాడుల్లో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రేండ్ల విజేందర్ తెలిపారు. భోరజ్ మండలం పెండల్వాడకు చెందిన అశోక్, ఆదిలాబాద్ రూరల్ మండలం భీంసరికి చెందిన కాకెర్ల అరుణ్, తాంసి మండలం లింగుగూడకు చెందిన టేకం రజిత దేశీ మద్యం విక్రయిస్తున్నట్లు నిర్ధారణ కాగా, వారి వద్ద మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు. పట్టుబడిన మద్యం విలువ రూ.5వేల వరకు ఉంటుందని ఎక్సైజ్ సీఐ పేర్కొన్నారు. మద్యం అక్రమ రవాణా, విక్రయాల్లో పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

### మట్కా నిర్వాహకుడిపై కేసు

ఎదులాపురం, జూన్ 21: ఆదిలాబాద్‌లోని ఖానాపూర్‌కు చెందిన రాయి సునీల్ కుమార్ మహారాష్ట్రకు చెందిన అశోక్ సామ్రాట్ ఆదేశాల మేరకు పట్టణంలో మట్కా చిట్టీలు రాస్తున్నాడు. అతని వద్ద సెల్ ఫోన్, మట్కా చీటీలు రూ.460 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ సీఐ బి.సునీల్ కుమార్ తెలిపారు.

### మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య

భైంసాటౌన్, జూన్ 21 : నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని వాడి గ్రామానికి చెందిన జాదవ్ పరశురాం(22) రంగారావ్ పల్సికర్ ప్రాజెక్టులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. రూరల్ ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం..పరశురాం కొద్ది రోజుల నుంచి మద్యానికి బానిసయ్యాడు. ప్రతి రోజూ మాదిరిగానే శుక్రవారం సాయంత్రం మద్యం తాగి ఇంటికి వెళ్లాడు. బయటకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి రంగారావ్ పల్సికర్ ప్రాజెక్టు వద్దకు వెళ్లాడు. మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది నీటిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుడి తండ్రి గజ్జారాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### యువ నాయకుడు జన్మదిన వేడుకలు


సురేందర్‌కు కేక్ తినిపిస్తున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

నేరడిగొండ, జూన్ 21 : బీఆర్ఎస్ మండల యువ నాయకుడు రాథోడ్ సురేందర్ జన్మదిన వేడుకలు నేరడిగొండలో శనివారం నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పాల్గొని పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సేవ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు రాథోడ్ సజన్, ప్రీతమ్ రెడ్డి, బీఆర్ఎస్ మండల కన్వీనర్ శివారెడ్డి, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, నాయకులు ప్రతాప్‌సింగ్, సంతోష్, వసంత్, రాజశేఖర్ పాల్గొన్నారు.

### 12 మంది విద్యార్థులకు అడ్మిషన్

కుభీర్, జూన్ 21: నిర్మల్ జిల్లా కుభీర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో శనివారం జాంగాం గ్రామంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లోని వసతులు ప్రధానోపాధ్యాయుడు సట్ల గంగాధర్, ఉపాధ్యాయులు వివరించారు. బాసరలోని నాగభూషణం ప్రైవేట్ పాఠశాలకు వెళ్లే 12 మంది విద్యార్థులు కుభీర్ హైస్కూల్‌లో అడ్మిషన్ తీసుకున్నారు.

### అక్రమణదారుల చెరవీడిన ప్రభుత్వ స్థలం

కుభీర్, జూన్ 21: నిర్మల్ జిల్లా కుభీర్‌లోని పీహెచ్‌సీ ప్రహరీ పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని గత కొన్నేళ్లుగా ఒక వర్గానికి చెందిన వ్యక్తులు ఆక్రమించి షెడ్లు, వేసుకొని అద్దెకు ఇచ్చుకుంటూ, మరి కొందరు వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. దీంతో వర్షాకాలంలో మురుగు నీరు పీహెచ్‌సీ, విఠలేశ్వర ఆలయం, మ్యాదరి గల్లీలోకి ప్రవహించడంతో ప్రజలకు అసౌకర్యం కలుగుతోంది. ఈ నేపథ్యంలో గత ఏడాది కుల సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో, ధర్నా నిర్వహించగా దిగి వచ్చిన ఆర్డీవో వారం లోగా తొలగింపజేస్తామని హామీ ఇచ్చారు. ఆక్రమణదారులు హైకోర్టును ఆశ్రయించగా, కోర్టు స్టే మంజూరు చేసింది. తాజాగా కోర్టు ప్రభుత్వ స్థలాన్ని ఖాళీ చేయాలన్న తీర్పు ఇచ్చింది. ఇటీవల భైంసా ఆర్డీవో కుభీర్‌కు వచ్చి షెడ్లు తొలగించాలని ఆక్రమణదారులకు సూచించారు. దీంతో శనివారం వారు స్వచ్ఛందంగా సామాను తరలించడం ప్రారంభించగా, విలువైన స్థలం చివరకు అధికారుల ఆధీనంలోకి వచ్చింది. ఈ పరిణామంపై కుభీర్ గ్రామస్తులు, మ్యాదరి గల్లీ వాసులు, విఠలేశ్వర ఆలయ కమిటీ, పీహెచ్‌సీ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### అమరవీరుల స్థూపాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

ఇంద్రవెల్లి, జూన్ 21 : అమరవీరుల స్థూపాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం రూ.కోటి మంజూరు చేసి అమరవీరుల స్మృతివనాన్ని ఏర్పాటు చేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలోని అమరవీరుల స్థూపాన్ని సందర్శించి అమరవీరులకు నివాళులర్పించారు. అక్కడ జరుగుతున్న స్మృతివనం పనులతో పాటు స్మృతి వనంలో నాటిన వివిధ రకాల చెట్లను పరిశీలించారు. అధికారులతో కలిసి వివిధ రకాల చెట్లు నాటారు. కార్యక్రమంలో రగల్ జెండా కమిటీ సభ్యులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు. అలాగే ఇంద్రవెల్లి మండలంలోని పిప్రి గ్రామంలో నిర్వహించిన పీఎం జన్మన్ సదస్సుకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ హాజరయ్యారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముకాడే ఉత్తమ్, రెవెన్యూ శాఖ అధికారులు మెస్రం లక్ష్మణ్, ఏఈవో కరుణ, నాయకులు పాల్గొన్నారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


ఎదులాపురం: యోగా చేస్తున్న ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్, పోలీస్ సిబ్బంది

నమస్తే నెట్‌వర్క్, జూన్ 21 : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని వక్తలు పేర్కొన్నారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో వేడుకలు నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, క్రీడా మైదానాల్లో, పార్టీ కార్యాలయాల్లో, పాఠశాలల్లో ఉద్యోగులు, క్రీడాకారులు, ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది, జిల్లా జైలుకు వచ్చిన ఖైదీలు, జైలు ఉద్యోగులు యోగాసనాలు వేశారు. యోగా శిక్షకులు యోగాసనాల వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. యోగాను దిన చర్యలో భాగం చేసుకోవాలని సూచించారు. ఆదిలాబాద్ పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ అఖిల్ మహాజన్ 300 మంది పోలీసు సిబ్బందితో కలిసి యోగాసనాలు వేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో, ఆయుష్ ఆధ్వర్యంలో రెవెన్యూ గార్డెన్, జిల్లా కోర్టులోని డీఎల్ఎస్ఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎంపీ నగేశ్, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్ కుమార్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు పాల్గొన్నారు. నిర్మల్‌లో కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, జిల్లా ఆయుష్ అధికారి నారాయణరావు, జిల్లా వైద్యాధికారి రాజేందర్, డీఈవో రామారావు, డీఎస్‌వో కిరణ్‌కుమార్, డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, ఆయుష్ అధికారులు, పాఠశాలల విద్యార్థులు, ఎస్పీ జానకీషర్మిల, ఏఎస్పీ రాజేష్ మీనా, సీఐ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

### మెనూ ప్రకారం భోజనం అందించాలి

తలమడుగు, జూన్ 21 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదిలాబాద్ డీఈవో శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం తలమడుగులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు రుయ్యాడిలోని ప్రాథమికోన్నత, సుంకిడిలో, సాకినపూర్, కజ్జర్ల గ్రామాల్లోని ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. తరగతి గదుల్లో ఉపాధ్యాయుల బోధన తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ వెనుక బడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట మండల విద్యా శాఖాధికారి వెంకట్ రావ్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 21 : సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు నిర్మల్ జిల్లాలో మల్టీ సర్వీస్ డే కేర్ సెంటర్ నిర్వహణకు స్వచ్ఛంద సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి సంక్షేమాధికారి ఫైజాన్ అహ్మద్ తెలిపారు. 3 సంవత్సరాల అనుభవం కలిగి డే కేర్ సెంటర్స్, వృద్ధాశ్రమాలు, చిల్డ్రన్ హోం షెల్టర్ గతంలో నిర్వహించిన వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులను ఈ నెల 30వ తేదీలోపు సంబంధిత ధృవీకరణ పత్రాలతో జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

### ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతమయ్యేలా చర్యలు తీసుకోవాలి

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 21 : నిర్మల్ జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతమయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. శనివారం రాష్ట్ర గృహ నిర్మాణ మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతమ్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఆయన కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ రెండో దశ ఇండ్లకు సంబంధించిన మార్కింగ్, గ్రౌండింగ్ పనులు ప్రతిరోజూ పర్యవేక్షిస్తూ త్వరగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ రాజేశ్వర్, గృహ నిర్మాణ, మున్సిపల్ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతుల కల్పనకు..

అంగన్‌వాడీ కేంద్రాల్లో మెరుగైన వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. నిర్మల్ కలెక్టర్ సమావేశమందిరంలో ఆయన అంగన్‌వాడీల్లో వసతుల కల్పనకు సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీలు చిన్నారుల కొరకు ప్రాథమిక విద్య కేంద్రాలుగా పని చేస్తున్నందున ప్రశాంత వాతావరణంలో అభివృద్ధి చెందేలా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో ఆకర్షణీయమైన పెయింటింగ్స్, ఆట బొమ్మలు ఏర్పాటు చేసి పిల్లలకు అనుకూలమైన వాతావరణం కల్పించాలన్నారు. సమావేశంలో సీడీపీవోలు నాగమణి, నాగలక్ష్మి, సరిత, సమన్వయకర్త నిరంజన్‌రెడ్డి, మండలాల పర్యవేక్షకులు, అధికారులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ కళాశాలలో ప్రవేశాలు తీసుకోవాలి

ఇంద్రవెల్లి, జూన్ 21: ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాల్లో మొదటి సంవత్సరం ప్రవేశాలు తీసుకోవాలని డీఐఈవో జాదవ్ గణేశ్ అధ్యాపకులకు సూచించారు. శనివారం ఇంద్రవెల్లి మండలంలోని లింగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించి, మొదటి సంవత్సరంలో ప్రవేశాలు పెంచాలని సూచించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ మారుతి, సూపరెంటెండెంట్ మోసిన్ ఉన్నారు.

### హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 21 : కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరిస్తున్న నిరంకుశత్వాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని నిర్మల్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గండ్రత్ రమేశ్ విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి అక్రమాలు, మంత్రుల అవినీతి, కాంగ్రెస్ నాయకుల దుర్మార్గాలను అడుగడుగునా ప్రశ్నించినందుకే హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై కుట్రపూరితంగా తప్పుడు కేసులు నమోదు చేసి అరెస్ట్ చేశారని ఆయన ఆరోపించారు. గత ఏడాదిన్నర కాలంగా ప్రజా సమస్యలపై పోరాడుతున్న కౌశిక్ రెడ్డిని కేసులతో ఇబ్బంది పెట్టే కుట్ర అనేక నెలల నుంచి కొనసాగుతునే ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి అణచివేత చర్యలతో ప్రజల దృష్టిని మళ్లించాలన్న ప్రయత్నాలు చేసిందని, అవి ఎప్పటికీ ఫలించవని హెచ్చరించారు. ఇందిరమ్మ రాజ్యమని చెబుతూ.. ఎమర్జెన్సీ శైలిలో సేచ్ఛా భావాలను అణిచివేయడం ఏమిటి అని ఆయన ప్రశ్నించారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అరెస్ట్‌ను వెంటనే రద్దు చేసి బేషరతుగా విడుదల చేయాలని గండ్రత్ రమేశ్ డిమాండ్ చేశారు.

### సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

నర్సాపూర్ (జీ), జూన్ 21 : సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. శనివారం నర్సాపూర్ (జీ)తో పాటు కుస్లి గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. గ్రామాల్లోని మురుగు కాలువలు, తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఎంపీవో తిరుపతి రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు కృష్ణ, కైలాస్, ఉపాధి, పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

బజార్‌హత్నూర్, జూన్ 21: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బజార్‌హత్నూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ భీంరావ్ అన్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలంలోని మోర్కండి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామస్తులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. అంతకుముందు గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఈవో సూర్యప్రకాశ్, హెల్త్ అసిస్టెంట్ గాజుల రమేశ్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.